విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పెద్దకారంపల్లిలో ఉన్న జెడ్పీహెచ్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వరదరాజు పాల్గొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నూరు భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరాజు, వార్డు మెంబర్ బాబు, హెచ్‌ఎం సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన చరిత్ర ప్రతి విద్యార్థికి తెలియజేయాలి

లక్కిరెడ్డిపల్లె : యోగి వేమన జీవిత చరిత్ర ప్రతి విద్యార్థికి తెలియజేయాలని రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె ఎంఆర్‌సీ భవనంలో యోగివేమన జీవిత చరిత్ర పుస్తకాలను ఆయన ఎంఈఓ చక్రేనాయక్‌తో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కడప జిల్లాలో జన్మించిన వేమన గురించి ప్రతి విద్యార్థికి ఈ పుస్తకాలను అందించి తెలియజేయాలన్నారు.

'ఐసీఐసీఐ' సేవలు అభినందనీయం

సంబేపల్లె : ఐసీఐసీఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ నిధులతో మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె గ్రామంలో చేపట్టిన సుంకరానిచెరువు పునఃనిర్మాణ పనులను ఆయన పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ నాగిరెడ్డిగారిపల్లె రైతుల సంక్షేమం దృష్ట్యా సుంకరానిచెరువు పునఃనిర్మాణానికి ఐసీఐసీఐ ఫౌండేషన్ శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచారు

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



ఓబులవారిపల్లె: వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల తదితరులు



పుల్లంపేట: వృద్ధురాలికి పింఛన్ గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి

పుల్లంపేట : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, సర్పంచ్ సుభాషిణిల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాల అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ద్వారా కృషి చేస్తున్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవ్వా, తాతలకు రూ. 2750లు పింఛన్‌ను అందజేస్తున్నారని, నవరత్నాలు పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని, కులమతాలకతీతంగా, పార్టీలకతీతంగా, అర్హత కల్గిన ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందించడం జరుగుతోందన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : నూతనంగా ఎంపికైన సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వానికి సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వ పథకాలను చురుగ్గా తీసుకెళ్లాలని, ప్రభుత్వంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలపై అవగాహన కల్పించాలని తెలపారు.

ఓబులవారిపల్లె : సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ డబ్బులు పెంచి పంపిణీ చేసినట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా కొత్త పింఛన్‌దారులకు ప్రభుత్వ విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వి.సాయికిషోర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పింఛన్ కోసం పడిగాపులు పడాల్సివచ్చేది. నేడు వలంటీర్లతో ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. చెప్పిన మాట ప్రకారం రూ. 2,750లకు పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడి నాగేంద్ర, వైస్ ఎంపీపీలు జీ గౌరీశంకర్ రాజు, కొమ్మూరు నరసింహారెడ్డి, సర్పంచ్‌లు ఎస్‌పీ జయపాల్‌రెడ్డి, లౌడి గంగురాజు,పోలిపాపిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు టీ కృష్ణారెడ్డి, తహసీల్దార్ పీర్ మున్ని, ఎంపీడీఓ విజయరావు, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, బాబురెడ్డి, దేశయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. తదుపరి పెనగలూరు మండలం ఓబిలికి చెందిన కే. గిరిజకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.4 లక్షల చెక్కును ఆయన అందజేశారు. తహసీల్దార్ పీర్ మున్ని జన్మదినం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనినివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

క్రీడాకారులకు కొరముట్ల ప్రశంస

రైల్వేకోడూరు అర్బన్ : బెంగుళూరు నగరంలో గత నెల 28వతేదీ నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో విదేశీ ఆటగాళ్లతో పోటీపడి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన ఎస్వీకే స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం ప్రశంసించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కోచ్‌లు శివాజీ, కృష్ణవేణి, విద్యార్థులు చైతన్యప్రసాద్, శ్రీరామ్, నిఖిల్, కృష్ణవేణి, దీక్షిత, శ్యామ్, కీర్తి, బార్గవ్, జ్యోతిలను కొరముట్ల అభినందించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, జి.సుధాకర్‌రాజు, సీహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు మరింత భరోసా

నందలూరు(రాజంపేట) : సీఎం జగన్ చెప్పిన మాట ప్రకారం అవ్వాతాతలకు పెంచిన పింఛను రూ.2750తో మరింత భరోసా కల్పించినట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం టంగుటూరు సచివాలయంలో ఆయన వృద్ధులకు పింఛన్ పంపిణీ చేసి, మాట్లాడారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తోందన్నారు. ప్రజలు జగనన్న వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, టంగుటూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులు, షావలీ, మురహరి, నాగేంద్ర, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్ పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో వైఎస్సార్ పెన్షన్ కానుక

రామాపురం : రాష్ట్రంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఒక పండగ వాతావరణంలో జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పెన్షన్ కానుక ప్రదానోత్సవానికి మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూరం వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షుడు, గడికోట జనార్ధన్‌రెడ్డి, కర్ణపు విశ్వనాథరెడ్డి, రవి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం

రాజంపేట టౌన్ : స్థానిక అమ్మవారిశాలలో సోమవారం రాత్రి రాఘవేంద్ర వైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛనలతో స్వామివారి కల్యాణ క్రతువును జరిపారు. కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామాపురంలో..

రామాపురం : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి కల్యాణం కమనీయంగా జరిగింది. మండలంలోని కంభరాయిని గుట్టపై మంగళరం వైకుంఠ ద్వాదశి సందర్భంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించుటకు మండల ప్రజలే కాకుండా వివిధ జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి, సతీమణి భారతీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లుచేశారు. తదనంతరం స్వామిని పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు.

నేడు ముద్దా చక్రపాణిరెడ్డి సంస్మరణ దినం



దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డితో ముద్దా చక్రపాణిరెడ్డి (ఫైల్)

చిట్వేలి : మండల పరిధిలోని మైలపల్లిలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముద్దా చక్రపాణి రెడ్డి దశ దిన కర్మకాండ బుధవారం (నేడు) నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ముద్దా చక్రపాణిరెడ్డి కుటుంబానికి వైఎస్ కుటుంబంతో మూడు తరాల నుంచి కొనసాగుతోంది. చక్రపాణిరెడ్డి తండ్రి ముద్దా ఎల్లారెడ్డి, వైఎస్ రాజారెడ్డిలు మంచి మిత్రులుగా కొనసాగుతుండేవారు. ఆ తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిలతో చక్రపాణి రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉండేవి. వైఎస్ కుటుంబీకులు ఎప్పుడు చిట్వేలికి వచ్చినా చక్రపాణి రెడ్డి గృహంలో విశ్రాంతి తీసుకునేవారు. మైలపల్లి పంచాయతీలో ఉన్న వైఎస్ ఎస్టేట్‌కు చక్రపాణిరెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తుండేవారు. వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాల కారణంగా గ్రామంలోని చెన్నకేశవ ఆలయ పునరుద్ధరణ, అలుగు ఏరుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు పరిష్కారం లభించింది. కాగా ఈ గత నెల 25న గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ముద్దా చక్రపాణి రెడ్డి (ఫైల్)

సమస్యలను అధికారులు పరిష్కరించాలి

ఒంటిమిట్ట : మండలంలో ఉన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని మండల ఉపాధ్యక్షురాలు బి.గీతా దేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సభలో వివరించారు. అలాగే కొందరు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను పరిష్కరించాలంటూ సభా దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్‌డీ రంగయ్య, కో–ఆప్షన్ మెంబర్ రఫీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రాజంపేటలో స్కిల్ హబ్

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఉన్న న్యాక్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈనెల 5వ తేదీ నుంచి అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు సంబంధించి శిక్షణా తరగతులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9440859408, 9603770097 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెద్దపల్లె ఆర్బీకే అకస్మిక తనిఖీ

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ ఆర్బీకేను మంగళవారం బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి, కియోస్కో యంత్రాన్ని, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో మోపూరి లోకేశ్వర్ రెడ్డి సాగు చేసిన 2 ఎకరాల పత్తి పంటను పరిశీలించి ఈ–క్రాప్‌ను నమోదు చేయించారు. అనంతరం డాక్టర్ వైఎస్ఆర్ తోటబడి కార్యక్రమంపై ఆరా తీశారు.

ఘనంగా గంధోత్సవం

సిద్దవటం : మండల కేంద్రంలోని బేల్దారి వీధిలో ఉన్న హజరత్ ఖాదర్‌వలీ దర్గాలో మంగళవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం హజరత్ ఖాదర్‌వలీ దర్గా నుంచి పకీర్ల విన్యాసాలతో జెండా ఊరేగింపు ప్రధాన రహదారి గుండా మహబూబ్ సుబహాని దర్గా వద్దకు వెళ్లి అక్కడ ప్రార్థనలు నిర్వహించి అనంతరం దర్గాకు చేరింది.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నేడు కొత్త పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు పింఛన్ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పింఛన్‌దారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.